సాక్షి
జనగామ
శుక్రవారం । 5 । జూలై । 2024



భూముల ఆక్రమణపై చర్యలు
టీజీఐఐసీ భూములను ఆక్రమించినవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సూచించారు. - 8లో▸



అసైదులా హోరతి..
త్యాగానికి ప్రతీకగా నిలిచే మొహరం వేడుకలను ముస్లింలు ఈనెల 17నుంచి జరుపుకోనున్నారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
33^0 /26^0
వాతావరణం
జిల్లాలో ఉదయం వాతావరణం సాధారణంగా ఉంటుంది. రోజంతా కాస్త ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి సమయంలో అక్కడక్కడా మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

చిల్పూరులో జోగిని శ్యామల పూజలు



చిల్పూరు: బల్కంపేట, లష్కర్, గోల్కొండ మొదటి బోనం ఎత్తుకునే జోగిని కొలిపాక శ్యామలాదేవి గురువారం బుగులు వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. ఆలయ ఈఓ లక్ష్మీ ప్రసన్న ఆధ్వర్యంలో అర్చకులు రవీందర్‌శర్మ, రంగాచార్యులు, కృష్ణమాచార్యుల వేద మంత్రాల నడుమ ప్రత్యేక పూజలు చేశారు. సిబ్బంది రమేష్, వీరన్న, వసంత, మల్లికార్జున్, లక్ష్మి, స్వరూప, కృష్ణ, మహేష్, హరిశంకర్, రాజేష్, విశాల్, శేఖర్, అజయ్, రాములు పాల్గొన్నారు.

డాక్టరేట్ ప్రదానం



లింగాలఘణపురం: మండలంలోని క్లాం గ్రామానికి చెందిన గజ్వేల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆర్థిక శాస్త్ర అధ్యాపకుడు ఏదునూరి రామచంద్రం ఉస్మానియా యూనివర్సిటీ నుంచి గురువారం డాక్టరేట్ అందుకున్నాడు. రామచంద్రం జనగామలో ఇంటర్మీడియట్ పూర్తి చేసి డిగ్రీ, పీజీ ఓయూలో పూర్తి చేశారు. అనంతరం స్కూల్ అసిస్టెంట్‌గా ఆదిలాబాద్ జిల్లా ఆసిఫాబాద్‌లో జూనియర్ లెక్చరర్‌గా పని చేస్తూ పదోన్నతిపై గద్వాల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు వెళ్లారు. ఓయూ ప్రొఫెసర్ డాక్టర్ రత్నకుమారి పర్యవేక్షణలో 'ఆదిలాబాద్ జిల్లాలోని షెడ్యూల్ తెగల స్వయం ఉపాధి పథకాల సమస్యలు, సూచనలు' అనే అంశంపై రామచంద్రం తన పరిశోధన పూర్తి చేశాడు.

రెసిడెన్షియల్ స్కూల్‌కు స్థల పరిశీలన



చిల్పూరు: ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణానికి రెండు గ్రామాల్లో స్థల పరిశీలన చేసినట్లు స్టేషన్‌ఘన్‌పూర్ ఆర్డీఓ వెంకన్న తెలిపారు. మండలంలోని రాజవరం గ్రామ సమీపంలోని కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాల, కళాశాల, లింగంపల్లిలో గురువారం 20ఎకరాల స్థలం కోసం డీటీ విమల, ఆర్‌ఐ కల్వల శ్రీనివాస్, సర్వేయర్ నరేష్‌నాయక్‌లతో కలిసి పరిశీలించినట్లు పేర్కొన్నారు. మొదట రాజవరం గ్రామంలో ప్రభుత్వ భూమి చూడగా 10 ఎకరాలు మాత్రమే ఉందని, లింగంపల్లిలో 20 ఎకరాలు ఉందని తెలిపారు. విషయాన్ని కలెక్టర్‌కు తెలియజేస్తామని వెల్లడించారు. ఆయన వెంట జక్కుల రాజయ్య, కర్ణాల ఎల్లయాదగిరి, నల్ల ఎల్లయ్య తదితరులు ఉన్నారు.

వరంగల్-1 డిపోకు 50 ఏళ్లు

హన్మకొండ: ఆర్టీసీ వరంగల్-1 డిపో స్థాపించి 50 ఏళ్లు పూర్తయింది.. ఈ సందర్భంగా గురువారం హనుమకొండలోని డిపోలో ఆర్టీసీ వరంగల్ రీజినల్ మేనేజర్ డి.విజయభాను ఆధ్వర్యాన కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. అనంతరం ఆర్‌ఎం మాట్లాడుతూ ఆర్టీసీకి ఆదాయం సమకూర్చడంలో వరంగల్-1 డిపో ప్రధాన పాత్ర పోషిస్తున్నదని, ఉద్యోగులు రెట్టింపు ఉత్సాహంతో పనిచేసి ఆదాయాన్ని పెంచాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఆర్‌ఎం కేశరాజు భానుకిరణ్, అసిస్టెంట్ ఇంజనీర్ టి.శ్రీనివాసులు, అసిస్టెంట్ మేనేజర్ (ట్రాఫిక్) సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా పోలీస్ షూటర్‌కు సీపీ అభినందన

వరంగల్ క్రైం: ఇటీవల నిర్వహించిన రాష్ట్ర స్థాయి మహిళా ఓపెన్ షూటింగ్ చాంపియన్ షిప్ పోటీల్లో బంగారు పతకం సాధించిన సుబేదారి పోలీస్‌స్టేషన్ మహిళా ఏఎస్సై వి.సువర్ణను వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అభినందించారు. సువర్ణ గత నెల 21 నుంచి 28వ తేదీ వరకు హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో 50 మీటర్ల రైఫిల్ ప్రోన్ మాస్టర్స్ విభాగంలో 579 పాయింట్లు సాధించి బంగారు పతకం అందుకున్నారు. గత నెల 15 నుంచి 20వ తేదీ వరకు తమిళనాడులో నిర్వహించిన ఆలిండియా పోలీస్ స్పెషల్ మహిళా షూటింగ్ పోటీల్లో రాష్ట్రం తరఫున పాల్గొని 5వ స్థానంలో నిలిచారు. సువర్ణను గురువారం సీపీ పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. క్రీడల్లో రాణించే పోలీస్ క్రీడాకారులకు తప్పక ప్రోత్సాహం అందుతుందని సీపీ తెలిపారు.

బదిలీలు, పదోన్నతులు

- 1,257మంది ఉపాధ్యాయులకు అవకాశం
- జూన్ 6న ప్రారంభమైన ప్రక్రియ
- విధుల్లో చేరిన ఉపాధ్యాయులు

జనగామ రూరల్: ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ ముగిసింది. సుదీర్ఘకాలం తర్వాత జూన్ 6వ తేదీన ప్రారంభమైన బదిలీ ప్రక్రియ నెల రోజుల పాటు కొనసాగింది. జిల్లాలో మొత్తం 2,097మంది ఉపాధ్యాయులు ఉండగా.. 1,257మందికి పదోన్నతులు, బదిలీలు లభించాయి. ఏళ్ల తరబడి ప్రమోషన్ల కోసం ఎదురు చూడగా నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ప్రక్రియ పూర్తి కావడంతో ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. బదిలీలు, పదోన్నతుల విషయంతో కోర్టు కేసుల పరిష్కారం కావడంతో కొంత, ఎన్నికల నేపథ్యంలో కొంత ఆలస్యం అయినప్పటికీ విద్యాశాఖ ఆదేశాల మేరకు నిబంధన ప్రకారం పూర్తి చేశారు. మొదటగా స్కూల్ అసిస్టెంట్లకు తర్వాత ఎస్జీటీలకు పదోన్నతులు, బదిలీలు చేపట్టారు.

ఎస్‌ఏలకు జీహెచ్‌ఎంలుగా..
జిల్లా వ్యాప్తంగా మొత్తం 47మంది స్కూల్ అసిస్టెంట్లు జీహెచ్‌ఎంలుగా పదోన్నతి పొందారు. ఇందు కోసం ఆన్‌లైన్ వెబ్ ఆప్షన్లకు ఇవ్వగా.. సీనియార్టీ జాబితా ఆధారంగా పదోన్నతులు కల్పించారు. అనంతరం స్కూల్ అసిస్టెంట్ల బదిలీల ప్రక్రియ చేపట్టారు. ఆతర్వాత ఎస్జీటీలు స్కూల్ అసిస్టెంట్‌లుగా పదోన్నతి పొందారు. చివరగా ఎస్జీటీల బదిలీలు జరిగాయి. దీంతో ఉపాధ్యాయులు ఆయా పాఠశాలల్లో విధుల్లోకి చేరారు.



జనగామ పట్టణంలోని హరిజనకాలనీ ప్రాథమిక పాఠశాలలో బాధ్యతలు స్వీకరిస్తున్న హెచ్‌ఎం



పాఠశాలలో జాయినింగ్ రిపోర్టు అందజేస్తున్న ఉపాధ్యాయుడు

ప్రమోషన్లు పొందిన వారు
జిల్లాలో మొత్తం 2,097మంది ఉపాధ్యాయులు ఉన్నారు. ఇందులో 1,257 మందికి బదిలీలు, పదోన్నతులు లభించాయి. ఇందులో ఎస్జీటీల నుంచి స్కూల్ అసిస్టెంట్‌లుగా 430మంది ప్రమోషన్లు లభించగా 29మంది ప్రమోషన్ వద్దని ఆయా పాఠశాలల్లోనే ఉన్నారు. వీరిలో 401 మంది వివిధ మండలాలల్లో ఉన్న పాఠశాల్లో జాయిన్ అయ్యారు. 444 మంది ఎస్జీటీలు ట్రాన్స్‌ఫర్స్ అయ్యారు. ఎస్‌ఏల నుంచి జీహెచ్‌ఎంలుగా 47మందికి పదోన్నతులు రాగా.. 336 మంది స్కూల్ అసిస్టెంట్లు ట్రాన్స్‌ఫర్ అయ్యారు.

ఆగుతూ సాగుతూ..
బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ పూర్తి చేసేందుకు విద్యాశాఖ ఆధికారులు సుదీర్ఘ కసరత్తు చేశారు. అటు కోర్టు తీర్పులు, ఇటు ఎన్నికల కోడ్‌తో ఆగుతూ సాగుతూ నెల రోజుల పాటు ఈ ప్రక్రియ కొనసాగింది. ప్రభుత్వం ఉత్తర్వులు రాగాలనే దశల వారీగా పదోన్నతులు, బదిలీలు నిబంధనల ప్రకారం పూర్తి చేపట్టారు. ఎడిట్ ఆప్షన్లు ఇచ్చిన వెంటనే శని, ఆదివారం, సోమవారం లోగా దాదాపు 90 శాతం పూర్తి చేసి విధుల్లోకి చేశారు. అయితే బదిలీ అయిన ఇంకా కొంత మంది తన రిపోర్టును అందజేయాల్సి ఉంది. 15రోజుల వరకు రిపోర్టు చేయడానికి గడవు ఉండగా 95శాతం మంది బదిలీల రిపోర్టు అందిన వెంటనే విధుల్లో చేరారు. పదోన్నతులకు తొలుతగా సబ్జెక్టుల వారీగా అర్హులైన ఉపాధ్యాయులతో కమిటీ ఏర్పాటు చేశారు. పదోన్నతుల కోసం దరఖాస్తు చేసుకున్న వారి సర్టిఫికేట్స్ వెరిఫికేషన్ చేసి సీనియార్టీ జాబితా రూపొందించి విద్యాశాఖ వెబ్‌సైట్‌లో పొందుపర్చారు. తుది జాబితాను సీఎస్‌కు పంపడంతో ఆమోదం లభించింది. ఆన్‌లైన్‌లో కౌన్సిలింగ్ చేపట్టి పదోన్నతులు పూర్తి చేశారు. మొత్తం సీనియార్టీ, రోస్టర్ పాయింట్ల ప్రాతిపాదికన ప్రక్రియ సాగింది. ఇదే మాదిరిగా ఎస్జీటీలో కూడా నిర్వహించారు.

ప్రక్రియ పూర్తి అయింది



ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ ప్రభుత్వ నిబంధనల ప్రకారం పూర్తి చేశాం. ఎలాంటి సమస్యలు రాకుండా నెల రోజుల పాటు కృషి చేశాం. ఉన్నత పాఠశాలలకు కొంత ఉపాధ్యాయుల కొరత తగ్గింది. ప్రాథమిక స్థాయిలో సర్దుబాటు చేసుకొని ముందుకెళ్తాం.
- రాము, డీఈఓ

విద్యా వలంటీర్లను నియమించాలి



బదిలీలు పదోన్నతులు కల్పించడంతో పాఠశాలలు కళకళలాడుతున్నాయి. ప్రాథమిక పాఠశాలలో బదిలీలు, ప్రమోషన్లలో ఖాళీ అయిన వాటిలో తాత్కాలికంగా విద్యావలంటీర్లను నియమించాలి. ఖాళీగా ఉన్న పోస్టుల్లో ప్రత్యామ్నాయంగా ఉపాధ్యాయులు రాకపోవడంతో కొన్ని పాఠశాలలు మూత పడే అవకాశం ఉంది.
- చంద్రశేఖర్‌రావు, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు

ఎస్జీటీలకు అన్యాయం జరిగింది



ప్రమోషన్లలో ఎస్జీటీలకు అన్యాయం జరిగింది. బాషా పండిట్‌లకు అప్‌గ్రేడ్ చేయడంతో ప్రమోషన్లు రావడం సంతోషం. అలాగే ఎస్జీటీలను అప్‌గ్రేడ్ చేయకపోవడం వల్ల వారు ప్రమోషన్లు పొందలేకపోయారు. మూతపడిన పాఠశాలలను తెరిపిస్తామని గతంలో ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. ఆపని పూర్తి చేయాలి.
- శ్రీనివాస్, టీపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు

ప్రజాసమస్యలు తెలుసుకోవాలి



వైట్ టీషర్ట్ ఆర్మీతో ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, ఝాన్సీరెడ్డి

పాలకుర్తి: నియోజకవర్గంలోని గ్రామాల్లో సోషల్ మీడియా కోఆర్డినేటర్లు ప్రజల సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించే దిశగా కృషి చేయాలని ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి అన్నారు. శుక్రవారం పాలకుర్తిలో సోషల్ మీడియా కో ఆర్డినేటర్లతో వైట్ టీషర్ట్ రాహుల్‌గాంధీ ఆర్మీని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఝాన్సీరెడ్డితో కలిసి ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. రాహుల్ గాంధీకి మద్దతుగా కోఆర్డినేటర్లతో రాహుల్ గాంధీ ఆర్మీని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో సోషల్ స్టేటస్ మీడియా కోఆర్డినేటర్ పెటెం నవీన్, పెండ్యాల వంశీకృష్ణ, గంధం సతీష్, శ్రీను, రవి కుమార్, సమ్మయ్య, రాజయ్య, ప్రదీప్ పాల్గొన్నారు.

కొమురయ్య జీవితం ఆదర్శనీయం

- కలెక్టర్ రిజ్వాన్ బాషా

జనగామ: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటయోధుడు దొడ్డి కొమురయ్య జీవితం నేటి తరానికి ఆదర్శమని కలెక్టర్ రిజ్వాన్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. కలెక్టరేట్‌లో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గురువారం దొడ్డి కొమురయ్య వర్ధంతిని అధికారికంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని కొమురయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జనగామ జిల్లా వాస్తవ్యుడు దొడ్డి కొమురయ్య త్యాగాలు, పోరాటాలను ప్రభుత్వం గుర్తించి అధికారికంగా వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్, బీసీ సంక్షేమ అధికారి రవీందర్, ఆలేటి సిద్దిరాములు, జూకంటి శ్రీశైలం, నోముల సోమయ్య, బోరెల్లి సిద్దులు, మోటె భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.



కొమురయ్య చిత్రపటం వద్ద నివాళులర్పించిన కలెక్టర్ రిజ్వాన్ బాషా, తదితరులు

జెడ్పీ స్పెషలాఫీసర్‌గా కలెక్టర్

జనగామ: జిల్లా పరిషత్ స్పెషల్ ఆఫీసర్‌గా కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషాను నియమిస్తూ పంచాయతీ రాజ్ రూరల్ డెవలప్‌మెంట్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా గురువారం ఉత్తర్వులు వెలువరించారు. ఈ మేరకు కలెక్టర్ నేడు (శుక్రవారం) బాధ్యతలను స్వీకరించనున్నారు. జెడ్పీ చైర్మన్‌తోపాటు సభ్యుల ఐదేళ్ల పదవీకాలం ముగియగా, స్పెషల్ ఆఫీసర్‌గా కలెక్టర్ కొనసాగనున్నారు. జెడ్పీ నూతన పాలక మండలి బాధ్యతలు స్వీకరించే వరకు ప్రత్యేక అధికారిగా కలెక్టర్ కొనసాగనున్నారు.



కలెక్టర్ రిజ్వాన్ బాషా

రుణబకాయిలు సకాలంలో చెల్లించాలి

- డీసీసీబీ ఘన్‌పూర్ బ్రాంచ్‌ను సందర్శించిన ఏజీఎం

స్టేషన్‌ఘన్‌పూర్: బ్యాంకు రుణబకాయిలను సకాలంలో చెల్లించాలని ఏజీఎం బోడ రాజు అన్నారు. గురువారం ఆయన డీసీసీబీ స్టేషన్‌ఘన్‌పూర్ బ్రాంచిని సందర్శించి, బ్యాంకులోని రిజిష్టర్లు, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా బ్రాంచిలో డిపాజిట్స్, అందించిన లోన్లు తదితర అంశాలపై మేనేజర్ మహబూబ్‌బీని అడిగి తెలుసుకున్నారు. అనంతరం బ్యాంక్ సిబ్బందితో కలిసి తెలంగాణ దశాబ్ది డిపాజిట్ పథకాన్నికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. నూతనంగా ప్రారంభించిన తెలంగాణ దశాబ్ది డిపాజిట్ స్కీమ్ మంచి పథకమని, అవకాశాన్ని ప్రజలు వినియోగంచుకోవాలని సూచించారు. ఈ పథకంలో 8.10 శాతం వడ్డీని బ్యాంకు నుంచి పొందవచ్చని, ఏడాది డిపాజిట్ చేసి వడ్డీని నెలకుగాని, మూడు నెలలకు గాని, ఏడాదికిగాని తీసుకోవచ్చని వివరించారు. డీసీసీబీ అందజేస్తున్న సౌకర్యాలను రైతులు వినియోగించుకోవాలని, బ్యాంకు నుంచి పొందిన రుణాలను సకాలంలో చెల్లించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఘన్‌పూర్ బ్రాంచి మేనేజర్ మహబూబ్‌బీ, సూపర్‌వైజర్ కృష్ణకాంత్, ఫయాజున్నీషా బేగం, అజయ్, వెంకటరమణ, వెంకటేష్, సాయి, పీఏసీఎస్ సీఈఓ మగ్దుం అలీ, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



తెలంగాణ దశాబ్ది డిపాజిట్ పథకం కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఏజీఎం రాజు, తదితరులు

ప్రజాసేవ చేయడంలో ఆనందం ఉంది

- ఇన్‌చార్జ్ జెడ్పీ చైర్‌పర్సన్ భాగ్యలక్ష్మి
- జెడ్పీటీసీల వీడ్కోలు సమావేశంలో పాల్గొన్న కలెక్టర్

జనగామ రూరల్: నిత్యం ప్రజల్లో ఉండి వారి కష్టాలు తెలుసుకొని, వారికి సేవ చేయడంలో ఉన్న ఆనందం మరెందులో లేదని ఇన్‌చార్జ్ జెడ్పీ చైర్‌పర్సన్ గిరబోయిన భాగ్యలక్ష్మి అన్నారు. గురువారం జెడ్పీటీసీల ప్రత్యేక సర్వసభ్య ఆత్మీయ వీడ్కోలు సమావేశం జెడ్పీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కలెక్టర్ రిజ్వాన్ బాషా, అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్ పాల్గొన్నారు. ఈసందర్భంగా గత ఐదేళ్ల కాలంలో తాము చేసిన పనులు, ఇబ్బందులను ప్రజాప్రతినిధులు పంచుకున్నారు. జఫర్‌గఢ్ జెడ్పీటీసీ ఇల్లెందుల బేబి మాట్లాడుతూ.. మండలంలో సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేశామని తెలిపారు. అధికారుల సహకారం వల్లనే ఇది సాధ్యమైందన్నారు. స్టేషన్ ఘన్‌పూర్ జెడ్పీటీసీ మారపాక రవి మాట్లాడుతూ.. గత ఐదేళ్ల నుంచి అనేక సమస్యపై సభలో మాట్లాడామని ఇప్పటి వరకు జెడ్పీకి సొంత భవనం లేకపోవడం బాధాకరం అని తక్షణం భవనంపై కలెక్టర్ దృష్టిసారించాలని కోరారు. ప్రోటోకాల్ విషయంలో ఇబ్బందులు పడ్డామని తెలిపారు. లింగాలఘనపురం జెడ్పీటీసీ గుడి వంశీధర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం అందించే సహకారంతోపాటు సొంతంగా మండలంలోని అనేక అభివృద్ధి కార్యక్రమాలు జెడ్పీటీసీగా హోదాలో చేసుకున్నామని తెలిపారు. పదవీకాలంలో తనకు సహకరించిన అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. రఘునాథపల్లి జెడ్పీటీసీ బొల్లం మణికంఠ మాట్లాడుతూ.. జెడ్పీటీసీగా పని చేసే అవకాశం అదృష్టంగా భావిస్తున్నట్లు చెప్పారు. అంతకుముందు జెడ్పీ చైర్మన్‌గా ఎన్నికైన పాగాల సంపత్‌రెడ్డి మృతి చెందడం బాధాకరం అని సభ్యులు సంతాపం తెలిపారు. అనంతరం జెడ్పీ చైర్‌పర్సన్ భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీలకు కలెక్టర్ రిజ్వాన్ బాషా శాలువాలు కప్పి సన్మానించి, జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ అనిల్ కుమార్, డిప్యూటీ సీఈఓ సరిత పాల్గొన్నారు.



వీడ్కోలు సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



జెడ్పీటీసీలను సన్మానిస్తున్న అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌కు విద్యార్థుల ఎంపిక



రక్షిత



శివకుమార్



మిచెల్లి



రాయల్ భీమ్

చిల్పూరు: మండలంలోని చిన్న పెండ్యాల, శ్రీపతిపల్లి గ్రామాల ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైనట్లు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పెద్ది వెంకటనారాయణగౌడ్ గురువారం ప్రకటించారు. శ్రీపతిపల్లి గ్రామానికి చెందిన రొయ్యల రక్షిత(8వ తరగతి), చెట్టబోయిన శివకుమార్(6వ తరగతి), చిన్నపెండ్యాలకు చెందిన గడ్డమీది మిచెల్లి(4వ తరగతి) ఎంపిక కాగా ఈనెల 7వ తేదీన హైదరాబాదులోని గోపీచంద్ అకాడమీ గచ్చిబౌలీలో జరిగే అథ్లెటిక్స్ చాంపియన్ షిప్‌లో పాల్గొంటారని తెలిపారు. ఎంపికైన విద్యార్థులను మండల విద్యాశాఖ నోడల్ అధికారి దాసరి గోవర్ధన్, హెచ్‌ఎంలు రామ్మోహన్‌రావు, సంపత్, పీఈటీ దిలీప్‌కుమార్, అరుణ, సత్యనారాయణ, సంపత్, వసంత్, సూర్యకళ అభినందించారు.

తమ్మడపల్లి (ఐ) విద్యార్థి..
జఫర్‌గఢ్: మండలంలోని తమ్మడపల్లి (ఐ) ప్రభుత్వ పాఠశాలకు చెందిన విద్యార్థి రడపాక రాయల్‌భీమ్ రాష్ట్రస్థాయి అథ్లెటిక్ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు రాంమ్మోహన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలలో 4వ తరగతి చదువుతున్న రాయల్ భీమ్ ఇటీవల జనగామ జిల్లా కేంద్రంలో జరిగిన జిల్లా స్థాయి రన్నింగ్, 50 మీటర్స్, 300 మీటర్స్ స్టాండింగ్ జంప్ పోటీల్లో ప్రతిభను కనబర్చి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. ఈ నెల 7న హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో నిర్వహించే రాష్ట్ర స్థాయి అథ్లెటిక్ పోటీల్లో పాల్గొననున్నట్లు ఆయన వెల్లడించారు. ఈసందర్భంగా రాయల్ భీమ్‌ను పాఠశాల ఉపాధ్యాయులతోపాటు గ్రామస్తులు అభినందించి, జాతీయ స్థాయికి ఎంపిక కావాలని ఆకాంక్షించారు.

'నిట్'లో కాన్ఫరెన్స్ ప్రారంభం

కాజీపేట అర్బన్: 'నిట్' వరంగల్ అంబేడ్కర్ లెర్నింగ్ సెంటర్ ఆడిటోరియంలో గురువారం 'ఈమర్జింగ్ మల్టీ ఫంక్షనల్ మెటీరియల్స్ అండ్ డివైజెస్ ఫర్ సస్టేయినబుల్ టెక్నాలజీస్(ఐఈఎండీఎస్టీ)-24' అనే అంశంపై రెండు రోజుల ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ప్రారంభమైంది. నిట్ ఫిజిక్స్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కాన్ఫరెన్స్‌ను ఏఆర్‌సీఐ హైదరాబాద్ రిటైర్డ్ డైరెక్టర్ డాక్టర్ నరసింహారావు, న్యూఢిల్లీ మిలి యా ఇస్లామియా యూనివర్సిటీ ప్రొఫెసర్ టోకిర్ అహ్మద్, నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుధీ ప్రారంభించి సావనీర్ విడుదల చేశారు.

రేపటినుంచి భద్రకాళి నవరాత్రి మహోత్సవాలు

హన్మకొండ కల్చరల్: భద్రకాళి దేవస్థానంలో దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఆలయ కార్యనిర్వహణాధికారి శేషుభారతి, ప్రధానార్చకులు భద్రకాళి శేషు ఆధ్వర్యంలో.. ఈనెల 6 నుంచి 21 వరకు భద్రకాళి శాకంబరి నవరాత్రి మహోత్సవాలు వైభవంగా జరగనున్నాయి. వరంగల్ నగర పర్యటనలో ఉన్న జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర మంత్రి కొండా సురేఖను గురువారం ఆలయ ఈఓ శేషుభారతి, అర్చకులు భద్రకాళి శేషు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా మంత్రుల చేతుల మీదుగా అమ్మవారి ఉత్సవాల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. మంత్రులు శ్రీనివాస్ రెడ్డి, కొండా సురేఖకు వేర్వేరుగా ఉత్సవాల ఆహ్వాన పత్రికతోపాటు అమ్మవారి తీర్థప్రసాదాలను అందజేశారు. ఈనెల 21న శాకంబరీ రూపంలో అమ్మవారు దర్శనం ఇవ్వనున్నార ని, ఆరోజు అమ్మవారిని దర్శించుకోవాలని మంత్రులను కోరినట్లు ఈఓ తెలిపారు. ప్రధాన కార్యదర్శి శైలజ రామయ్యర్, కమిషనర్ హనుమంతరావు, సూపరింటెండెంట్ విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ సిద్ధాంతాలకు శ్యామప్రసాద్ ముఖర్జీ స్ఫూర్తి

- పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి

జనగామ: బీజేపీ సిద్ధాంతాలకు శ్యామప్రసాద్ ముఖర్జీ స్ఫూర్తి అని, కాశ్మీర్.. భారత్‌లో అంతర్భాగమని చాటిచెబుతూ యువతను చైతన్యపరిచిన నాయకుడు డాక్టర్ శ్యాం ప్రసాద్ ముఖర్జీ అని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి అన్నారు. ముఖర్జీ బలిదాన్ దివస్‌ను పురస్కరించుకుని గత నెల 23 నుంచి జూలై 6వ వరకు రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు నిర్వహించ తలపెట్టిన కార్యక్రమంలో భాగంగా గురువారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఆయన పాల్గొని మొక్కలు నాటారు. అనంతరం మాట్లాడుతూ.. శ్యామప్రసాద్ ముఖర్జీ స్ఫూర్తితోనే నేడు బీజేపీ తన సిద్ధాంతాలను అమలు చేస్తోందని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మహంకాళి హరిశ్చంద్ర గుప్త, నాయకులు ఉడుగుల రమేష్, శివరాజ్ యాదవ్, సౌడ రమేష్, కొంతం శ్రీనివాస్, పిట్టల సత్యం తదితరులు పాల్గొన్నారు.



మొక్క నాటి నీరు పోస్తున్న ప్రేమేందర్‌రెడ్డి

అల్లూరి పోరాట స్ఫూర్తి చిరస్మరణీయం


- సీపీఎం జిల్లా కార్యదర్శి కనకారెడ్డి

దేవరుప్పుల : దేశస్వాతంత్రోద్యమంలో అలుపెరుగని పోరాటం చేసిన అల్లూరి సీతారామరాజు పోరాట స్ఫూర్తి చిరస్మరణీయమని సీపీఎం జనగామ జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ కత్తుల విజయ్‌కుమార్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని జనగామ -సూర్యాపేట రహదారి సింగరాజుపల్లి చౌరస్తాలో అల్లూరి సీతారామరాజు జయంతి విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమాల్లో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు సింగారపు రమేశ్, ఇర్రి అహల్య, గోపి, ప్రకాష్, విజేందర్, మీకే నాయక్, తదితరులు పాల్గొన్నారు.



అల్లూరి సీతారామరాజు విగ్రహం వద్ద నివాళులర్పించిన నాయకులు

దొడ్డి కొమురయ్య స్ఫూర్తితో రాష్ట్ర అభివృద్ధి



విగ్రహావిష్కరణ అనంతరం అభివాదం చేస్తున్న మంత్రి, విప్, ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు, తదితరులు

తెలంగాణ సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య స్ఫూర్తితో తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తామని ఆర్‌అండ్‌బీ, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రం హైదరాబాద్ రోడ్డు క్లాం కమాన్ వద్ద పట్టణ కురుమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దొడ్డి కొమురయ్య విగ్రహాన్ని ఆయన గురువారం ఆవిష్కరించారు.

- వివరాలు 8లో▸

క్లుప్తంగా

ముగిసిన స్పోర్ట్స్ హాస్టల్ ఎంపికలు

వరంగల్ స్పోర్ట్స్: హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో రెండు రోజుల పాటు నిర్వహించిన ప్రాంతీయ వసతి గృహ ఎంపిక పోటీలు గురువారం ముగిశాయి. జిమ్నాస్టిక్స్, అథ్లెటిక్స్, హ్యాండ్‌బాల్, రెజ్లింగ్, స్విమ్మింగ్ క్రీడలలో నిర్వహించిన ఎంపిక పోటీలకు క్రీడాకారుల నుంచి విశేష స్పందన లభించిందని హనుమకొండ డీవైఎస్‌ఓ గుగులోత్ అశోక్‌కుమార్ తెలిపారు. మహబూబ్‌నగర్, కొత్తగూడెం, నాగర్‌కర్నూల్ జిల్లాల నుంచి 300 మంది క్రీడాకారులు హాజరైనట్లు తెలిపారు. 30 మీటర్ల ఫ్లయింగ్ స్టార్ట్, స్టాండింగ్ బ్రాడ్ జంప్, వర్టికల్ జిమ్, మెడిసిన్ బాల్‌త్రో, 800 మీటర్ల పరుగుపందెం, బ్యాటరీ టెస్టులు నిర్వహించామన్నారు. క్రీడాకారుల ప్రతిభ ఆధారంగా పాయింట్లు కేటాయించి తుది జాబితా 'శాట్'కు నివేదించనున్నట్లు పేర్కొన్నారు. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ కోచ్‌ల బృందం ఆధ్వర్యాన నిర్వహించిన ఎంపికల్లో డీఎస్‌ఏ కోచ్‌లు, క్రీడా సంఘాల బాధ్యులు, తదితరులు పాల్గొన్నారు.

సబ్ కాంట్రాక్టర్‌పై దాడి

- కర్రలతో కారు అద్దాలు ధ్వంసం
- మహిళ, చిన్నారికి గాయాలు



దాడిలో గాయపడిన కాంట్రాక్టర్ రాజు, అతడి భార్య, కూతురు, బావ

తరిగొప్పుల: కల్వర్టు నిర్మాణ పనులు చేస్తున్న సబ్ కాంట్రాక్టర్‌పై కర్రలతో దాడికి పాల్పడ్డారు. ఈ ఘటన మండలంలో గురువారం చోటు చేసుకుంది. ఈ దాడిలో కారు అద్దాలు ధ్వంసం కాగా కాంట్రాక్టర్‌తో పాటు అతడి భార్య, చిన్నారి, బావకు తీవ్రగాయాలయ్యాయి. బాధితుడి కథనం ప్రకారం.. హనుమకొండ హంటర్‌రోడ్‌కు చెందిన బొమ్మిశెట్టి రాజు మండలంలోని సోలిపూర్, పోతారం గ్రామాల మధ్యలో కల్వర్టు నిర్మాణ పనులు చేపడుతున్నాడు. ఈ క్రమంలో రైతు కందుల యాదగిరి తన వ్యవసాయ భూమికి నష్టం కలుగుతుందని కల్వర్టు నిర్మాణ పనులు అడ్డుకున్నాడు. గతంలోనే కొంత పరిహారం ఇవ్వగా మళ్లీ డబ్బు కావాలని బుధవారం డిమాండ్ చేశారు. దీంతో కాంట్రాక్టర్, సదరు భూమి యజమానికి స్వల్ప వివాదం చోటుచేసుకుంది. బొమ్మిశెట్టి రాజు సోలిపూర్‌లో అద్దెకుంటున్న ఇంటి నుంచి తన కారులో స్వగ్రామం వెళ్తున్నాడు. ఈ క్రమంలో కందుల యాదగిరితో పాటు అతడి కుమారులు మధు, సతీశ్, నరేశ్ అడ్డగించి కర్రలతో కారుపై దాడి చేసి అద్దాలు ధ్వంసం చేశారు. కారులో కూర్చున్న బొమ్మిశెట్టి రాజును కిందకు లాగి కర్రలతో దాడికి పాల్పడ్డారు. అంతేకాకుండా కాంట్రాక్టర్‌పై భార్య శ్యామల, చిన్నారి నిషిక, బావ శివరాత్రి మధుపై కర్రలతో దాడికి పాల్పడ్డారు. ఈ విషయంపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బొమ్మిశెట్టి రాజు తెలిపారు. ఈ విషయమై ఎస్సై శ్వేతను వివరణ కోరగా కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

అసైదులా హారతి..



పీరీల ఊరేగింపు(ఫైల్)

- 17న మొహర్రం
- పీరీల ముస్తాబు

కాజీపేట : త్యాగం.. శాంతికి ప్రతీక మొహర్రం. ప్రజాస్వామ్యం.. మానవ హక్కుల పరిరక్షణ కోసం 14 శతాబ్దాల క్రితమే జరిగిన చారిత్రాత్మక పోరాటమే మొహర్రం. స్థానికంగా పీరీల పండుగ అంటున్నా మొహర్రం పండుగ కాదు. కర్బలా మైదానంలో జరిగిన యుద్ధంలో మృతి చెందిన వారి జ్ఞాపకార్థం శోక (సంతాప) దినాలుగా ఆచరిస్తారు. మొహర్రంలోని పది రోజులు విషాదదినాలే. ముస్లింలే కాకుండా ముస్లిమేతరులూ సమభావం, సామరస్యంతో కార్యక్రమాల్లో పాలు పంచుకుంటారు. కాగా, మొహర్రం మాసం ఆరంభం నుంచి ఇస్లాం నూతన సంవత్సరం ప్రారంభమవుతుంది. ఇమామ్ హుస్సేన్ వీరమరణానికి నిదర్శనంగా చావిడి (మఖానం)లో పీరీలను కూర్చోబెట్టి పది రోజులపాటు ప్రార్థనలు చేస్తారు. కుల, మతాలకతీతంగా అందరూ పాల్గొని పీరీల వద్ద ప్రత్యేక పూజలు, చదివింపులు (ఫాతేహాలు) జరపడం విశేషం. మత సామరస్యతకు ఇది గొప్ప నిదర్శనంగా చెప్పొచ్చు. 10వ రోజు తెల్లవారుజామున 3.30 గంటలకు అగ్నిగుండంలోకి పీరీలు ప్రవేశించి ఊరంతా గ్రామోత్సవం జరుపుకుంటాయి. ఇస్లామియా భాషలో 'అషురా' అంటారు. ప్రాణత్యాగం చేసిన ఉదంతాన్ని షహదత్‌గా (ఈనెల 17న మొహర్రం) నిండు శోకంతో జరుపుతారు. ఊరేగింపు సమయంలో పీరీలను ప్రతి ఇంటి ముందు ఆపుతారు. ఆ సమయంలో ఇంటివారు బిందెలతో నీటిని తెచ్చి పీరీలను ఎత్తుకున్న వారి పాదాలను శుభ్రం చేసి పాద నమస్కారాలు చేసుకుంటారు. కులమతాలకతీతంగా భక్తి ప్రపత్తులను చాటుకుంటారు. అదేరోజు సాయంత్రం పీరీలను చావిడి నుంచి తీసుకుని గ్రామ శివారులోని పొలిమేర వరకు తీసుకెళ్లి వాటిని శుభ్రం చేసి మళ్లీ చావిడికి తీసుకొస్తారు. అప్పుడు మొహర్రం పూర్తవుతుంది.

17న మొహర్రం.. బీబీకా ఆలం

17వ తేదీ మధ్యాహ్నం నుంచి పీరీలను మరోసారి గ్రామంలో ఊరేగిస్తారు. పీరీలు ఏటీకి పోతుంటే భక్తులంతా బెల్లం, నువ్వులు కలిపిన గట్టాలను చల్లుతుంటారు. గ్రామశివారులోని పోలిమేర వరకు తీసుకెళ్లాక అక్కడ పీరీలను శుభ్రంచేసి ఓ మూట కడుతారు. 'ఆల్‌బిదాయో ఏకుసేని' అంటూ బీబీకా ఆలం పాటను ఆలపిస్తూ పీరీలతో పాటు వాటికి అమర్చిన కర్రలు, దట్టీలను మఖానం వరకు తీసుకువస్తూ రోదిస్తుంటారు.

త్యాగ స్మృతులకు నిదర్శనం



ఇమామ్‌హుస్సేన్ మానవత్వానికి జీవం పోసిన ధీరుడు. ఇరాక్ రాజు యాజిద్ అన్యాయాన్ని ఎదుర్కోవడంలో వీరమరణం పొందారు. ఆయన త్యాగాలను స్మరించుకుంటూ, ధర్మపరిపాలనను మెచ్చుకుంటూ ఏటా మొహర్రం మాసంలో వచ్చే ఈ శోకదినాలను జరుపుకుంటాం. అన్ని మతాల వారు పీరీల పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకుంటూ సామరస్యతకు ప్రతీకగా నిలుస్తున్నారు.

\- అమ్మాబాయి, కాజీపేట

మొక్కుబడులు ఘనంగా...

మేళతాళాలు, డప్పు చప్పుళ్లతో ఇంటికి వచ్చిన పీరీలకు ఆ ఇంటివారు పూలు, కాగితాలతో అందంగా తయారు చేసిన బాసింగాలు, రంగుల దట్టీలు, వెండి, బంగారు గొడుగులు, తొట్టెలు ఇచ్చి భక్తిశ్రద్ధలతో మొక్కులు చెల్లించుకుంటారు. ఇళ్ల నుంచి పానకం, వడపప్పు, చక్కెర, బెల్లం, ఎండు కొబ్బరిని మఖానం వరకు సపరివారంగా తీసుకొచ్చి సమర్పిస్తారు. వీటిని స్వీకరించిన చావిడి.. (పూజారి) ముతవలి పీరీలను ఎత్తుకున్న వారికి భక్తితో సమర్పిస్తారు.

జియారత్

మొహర్రం అనంతరం మూడురోజులకు జియారత్ నిర్వహిస్తారు.

22న దాశరథి శతజయంతి ఉత్సవాలు

- ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్

మహబూబాబాద్: ఈనెల 22న నిర్వహించే దాశరథి కృష్ణమాచార్య శత జయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలని ఎమ్మెల్సీ, గాయకుడు దేశపతి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు క్యాంపు కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. శతజయంతి రోజు ఉదయం 9 గంటలకు చిన్నగూడూరులోని దాశరథి విగ్రహానికి పూల మాల వేసిన అనంతరం అక్కడ నుంచి జిల్లా కేంద్రానికి బైక్ ర్యాలీ ఉంటుందన్నారు. జిల్లా కేంద్రంలోని ఎస్‌వీఎం ఫంక్షన్ హాల్‌లో శత జయంతి సభ ఉంటుందన్నారు. శత జయంతి ఉత్సవాలను ఈ ఏడాది జూలై 22 నుంచి వచ్చే ఏడాది జూలై 22 వరకు ఏడాది పాటు నిర్వహిస్తామన్నారు. జయంతి సభకు ప్రముఖ కవులతో పాటు మానుకోట , డోర్నకల్ ఎమ్మెల్యేలు, మానుకోట ఎంపీని కూడా ఆహ్వానిస్తామన్నారు. సమావేశంలో ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, మున్సిపల్ చైర్మన్ పాల్వాయి రామ్మోహన్‌రెడ్డి, వైస్‌చైర్మన్ మార్నేనీ వెంకన్న, నాయకులు మంగళంపల్లి కన్నా , ఎడ్ల వేణుమాధవ్, గాడిపల్లి మధు, గుర్రపు సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

మాకు న్యాయం చేయాలి..

- మృతురాలి బంధువుల డిమాండ్
- భర్త ఇంటి ఎదుట భార్య మృతదేహంతో ధర్నా
- డీఎస్సార్ జెండాల్‌తండాలో ఘటన



అనూష మృతదేహంతో ధర్నా చేస్తున్న బంధువులు

మరిపెడ రూరల్: పెళ్లి అయినా మరో పెళ్లి చేసుకుని భర్త తనను మోసం చేశాడని భార్య బాదావత్ అనూష ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన విషయం విదితమే. ఈ విషయంపై భర్త ఇంటి ఎదుట అనూష మృతదేహంతో బంధువులు ధర్నా చేపట్టారు. మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం డీఎస్సార్ జెండాల్ తండా జీపీ పరిధిలోని ఆముదాలగడ్డతండాలో గురువారం చోటు చేసుకున్న ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. తండాకు చెందిన బాదావత్ అనూష (20) అదేతండాకు చెందిన వివాహితుడు భూక్య సురేశ్ ప్రేమించుకుని రెండు సంవత్సరాల క్రితం పెళ్లి చేసుకున్నారు. కొంతకాలం పాటు వీరి కాపురం సజావుగా జరిగింది. అయితే ఇటీవల మొదటి భార్య జ్యోతి, రెండో భార్య అనూష, సురేశ్ మధ్య నిత్యం గొడవలు చోటు చేసుకుంటున్నాయి. ఈ క్రమంలో అనూషను భర్త సురేశ్.. మొదటి భార్య బంధువులతో కలిసి తీవ్రంగా కొట్టాడు. దీనికి తోడు సురేశ్ కత్తితో నిత్యం బెదిరించడంతో పాటు వేధింపులకు పాల్పడ్డాడు. దీంతో మనస్తాపానికి గురైన అనూష.. నా చావుకు కారణం భర్త సురేశ్ అని సూసైడ్ రాసి బుధవారం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. పోస్టుమార్టం అనంతరం మృతురాలి కుటుంబీకులు తమకు న్యాయం చేయాలని సురేశ్ ఇంటి ఎదుట అనూష మృతదేహంతో ధర్నా చేపట్టారు. దీంతో 20 గంటల పాటు తండాలో ఉద్రిక్త వాతావరణం చోటు చేసుకుంది. ఈ విషయం తెలుసుకున్న మరిపెడ సీఐ హత్తిరాం నాయక్, ఎస్సైలు తాహెర్‌బాబా, సంతోష్ హుటాహుటినా ఘటనాస్థలికి చేరుకుని బాధిత కుటుంబానికి న్యాయం చేసి సురేశ్‌కు శిక్షపడేలా చేస్తామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు.

ఆస్కార్ గ్రంథాలయం.. దేవాలయం

- భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు
- రూ.36 లక్షలతో నిర్మించిన గ్రంథాలయం ప్రారంభోత్సవం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

చిట్యాల: ఆస్కార్ గ్రంథాలయం.. ఒక దేవాలయమని, దీనిని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. గురువారం మండలంలోని చల్లగరిగ గ్రామంలో సినీ గేయ రచయిత, ఆస్కార్ అవార్డు గ్రహీత కనుకుంట్ల చంద్రబోస్ తన సొంత నిధులు రూ.36 లక్షలతో నిర్మించిన నూతన గ్రంథాలయాన్ని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు.. చంద్రబోస్ తండ్రి రిటైర్డ్ టీచర్ నర్సయ్య చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ చంద్రబోస్ పుట్టిన ఊరి కోసం.. ఇచ్చిన మాట ప్రకారం ఆస్కార్ గ్రంథాలయం నిర్మించారన్నారు. ఆర్‌ఆర్‌ఆర్ సినిమాలో చంద్రబోస్ రాసిన పాటకు ఆస్కార్ అవార్డు రావడం ఆనందంగా ఉందన్నారు. ఈ ప్రాంత బిడ్డ ఉన్నత శిఖరాలకు ఎదగడం అభినందనీయమన్నారు. అలాగే గ్రంథాలయానికి ఆస్కార్ పేరు పెట్టడం శుభసూచకమన్నారు. కాగా, ఈ గ్రంథాలయానికి తన వంతుగా రూ. 10లక్షలు కేటాయించనున్నట్లు తెలిపారు. అనంతరం అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ విద్యతోనే ప్రతి ఒక్కరూ అభివృద్ధి సాధిస్తారని, ఈ విషయంలో చంద్రబోస్ తన కల నెరవేర్చుకున్నారన్నారు. చంద్రబోస్ కూడా కష్టపడి చదువుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించారన్నాడు. ఆర్‌ఆర్‌ఆర్ సినిమాలో తాన రాసిన పాటకు ఆస్కార్ అవార్డు అభినందనీయమన్నారు. అనంతరం గ్రంథాలయ ఆవరణలో మొక్కలు నాటారు.

విజ్ఞానవంతులుగా ఎదగాలి..

ఆస్కార్ గ్రంథాలయంలో విద్యార్థులు చక్కగా చదువుకుని విజ్ఞానవంతులుగా ఎదగాలని సినీ గేయ రచయిత, ఆస్కార్ అవార్డు గ్రహీత చంద్రబోస్ అన్నారు. తన సొంత నిధులతో నిర్మించిన ఆస్కార్ గ్రంథాలయాన్ని ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. చిన్నప్పుడు తాను ఇదే గ్రంథాలయంలో చదువుకున్నానని గుర్తు చేశారు. ఇక్కడే చదువుకుని ఉన్నత చదువు కోసం పట్టణాలకు వెళ్లానని తెలిపారు. ఇటీవల ఆస్కార్ అవార్డు రావడంతో తన సొంత గ్రామానికి వచ్చానన్నారు. ఇంటికి వచ్చిన తాను గ్రంథాలయాన్ని సందర్శించగా శిథిలావస్థలో ఉందన్నారు. దీంతో తన తండ్రి కోరిక మేరకు నూతన గ్రంథాలయ నిర్మాణం చేపట్టాలనుకున్నారన్నారు. ఇందులో భాగంగా గ్రామస్తుల సహకారంతో సొంతంగా రూ.36 లక్షలతో గ్రంథాలయాన్ని నిర్మించానన్నారు. ఈ గ్రంథాలయానికి ఆస్కార్ నామకరణం చేయడం తన పూర్వ జన్మ సుకృతంగా భావిస్తున్నానని తెలిపారు. విద్యార్థులు, గ్రామస్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర పౌర గ్రంథాలయాల శాఖ సంచాలకుడు ఏవీఎన్ రాజు, జిల్లా గ్రంథాలయాల కార్యదర్శి శ్రీలత, ఎంపీపీ దావు వినోద, ఎంపీఓ, గ్రామ ప్రత్యేకాధికారి రామకృష్ణ, లైబ్రేరియన్ చంద్రమౌళి, రిటైర్డ్ టీచర్ రాజమౌళి, చంద్రబోస్ స్నేహితులు జేఎన్‌టీయూ ప్రొఫెసర్ బాబురావు, వీరారెడ్డి, ఉపాధ్యాయులు కామిడి సతీష్‌రెడ్డి, సూదం సాంబమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

కొమురయ్య స్ఫూర్తితో రాష్ట్రాభివృద్ధి

ఆర్‌అండ్‌బీ, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

- జిల్లా కేంద్రంలో దొడ్డి కొమురయ్య విగ్రహం ఆవిష్కరణ
- పెద్ద ఎత్తున తరలివచ్చిన కురుమ కుల బాంధవులు



దొడ్డి కొమురయ్య విగ్రహం ఆవిష్కరించి పూలమాల వేస్తున్న మంత్రి కోమటిరెడ్డి, పక్కన విప్ అయిలయ్య, ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి

జనగామ: తెలంగాణ సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య స్ఫూర్తితో తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తామని ఆర్‌అండ్‌బీ, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రం హైదరాబాద్ రోడ్డు క్లాం కమాన్ వద్ద పట్టణ కురుమ సంఘం ఆధ్వర్యంలో దొడ్డి కొమురయ్య విగ్రహం ఏర్పాటు చేశారు. గురువారం ఆయన వర్ధంతి సందర్భంగా సంఘం పట్టణ అధ్యక్షుడు బాల్దె మల్లేశం అధ్యక్షతన జరిగిన వేడుకల్లో ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, ఎంపీ చామల కిరణ్ కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డితో కలిసి ముఖ్యఅతిథిగా పాల్గొన్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి.. కొమురయ్య విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం సాయిరాం ఫంక్షన్ హాల్‌లో జరిగిన సభలో మంత్రి మాట్లాడారు. 19 ఏళ్ల వయసులోనే తెలంగాణ సాయుధ పోరాటంలో అసువులు బాసిన వీరుడు కొమురయ్య అన్నారు. దొడ్డి కొమురయ్య, చాకలి ఐలమ్మ.. ఇలా ఎందరో మహానుభావులు జనగామ జిల్లా గడ్డపై జన్మించి పునీతం చేశారన్నారు. ఏడో నిజాం మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ పాలనలో ప్రజలు నలిగిపోయారని పేర్కొన్నారు. రాష్ట్ర రాజధాని హైదరాబాద్ ట్యాంకు బండ్‌పై దొడ్డి కొమురయ్య కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. వచ్చే ఏడాది ఏప్రిల్ 3వ తేదీన జరిగే జయంతి రోజున ఆవిష్కరించేలా ముఖ్యమంత్రిని ఒప్పించి, పండగను తలపించేలా వేడుకలు నిర్వహిస్తామన్నారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు, అన్నదాతలతో పాటు ప్రతీ పేదకు సర్కారు నుంచి భరోసా దొరికినప్పుడే దొడ్డి కొమురయ్య ఆశయం నెరవేరుతుందని పేర్కొన్నారు. అనంతరం ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య మాట్లాడుతూ విస్నూరు దొర తల్లి రాణి వెంకటజానమ్మ అరాచకాల నుంచి ప్రజలకు విముక్తి కలిగించేందుకు రెండు పదులు దాటని వయసులో దొడ్డి కొమురయ్య గడీల పాలనను బద్దలు కొట్టారన్నారు. తెలంగాణ ఆకాంక్షకు ఊపిరిపోసిన సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య త్యాగం చిరస్మరణీయమని భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి అన్నారు. సాయుధ పోరాటయోధుడు దొడ్డి కొమురయ్య రగిలించిన స్ఫూర్తితో ఈ ప్రాంత ప్రజలు నిత్యం చైతన్యంతో పేదల పక్షాన నిలబడి పోరాటాలు చేస్తుంటారని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. దోపిడీ, బానిసత్వానికి వ్యతిరేకంగా పోరాటం చేసి అతి చిన్న వయసులో వీర మరణం పొందిన దొడ్డి కొమురయ్య బాటలో నడుస్తూ సమాజహితం కోసం పని చేయాలని డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పోకల జమున, మాజీ మార్కెట్, మున్సిపల్ చైర్మన్లు వేమెళ్ల సత్యనారాయణరెడ్డి, ఎర్రమల్ల సుధాకర్, కురుమ సంఘం జిల్లా అధ్యక్షుడు కంచె రాములు, విగ్రహ దాత కడకంచి శ్రీనివాస్, కార్యదర్శి జాయ మల్లేశ్, పట్టణ కార్యదర్శి జూకంటి శ్రీశైలం, కోశాధికారి కేమిడి ఉపేందర్, గౌరవ అధ్యక్షులు మోటె శ్రీశైలం, కర్రె కృష్ణ, ఎంగ్రు వైకుంఠం, సంఘ యూత్ జిల్లా అధ్యక్షుడు సేవెల్లి మధు, కౌన్సిలర్ కర్రె శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య



సంపత్‌రెడ్డి (ఫైల్)

తొర్రూరు: పెళ్లి కావడం లేదని మనస్తాపం చెందిన ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలోని ఫత్తేపురంలో జరిగింది. ఎస్సై జగదీశ్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కుంభం సంపత్‌రెడ్డి(38) వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కొన్నేళ్లుగా కుటుంబ సభ్యులు సంబంధాలు చూడగా ఎక్కడా కుదరలేదు. దీంతో ఇక తనకు వివాహం కాదని, చావే శరణ్యమని తలచి కుటుంబీకులు నిద్రలో ఉండగా బుధవారం రాత్రి పురుగుల మందు తాగాడు. అపస్మారక స్థితికి చేరిన సంపత్‌రెడ్డిని అతడి సోదరుడు యాకూబ్‌రెడ్డి గమనించి ఆసుపత్రికి తరలిస్తున్న క్రమంలో మార్గమధ్యలో మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుడి తండ్రి ఉప్పల్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జగదీశ్ తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో మద్దులపల్లిలో మహిళ..

కాళేశ్వరం : ఆర్థిక ఇబ్బందులతో ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన మహదేవపూర్ మండలం మద్దులపల్లిలో జరిగింది. ఎస్సై చక్రపాణి కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన బాల్నె వనిత(42)ఆర్థిక ఇబ్బందులతో మనస్తాపం చెంది గురువారం పురుగుల మందు తాగింది. కుటుంబ సభ్యులు గమనించి హుటాహుటిన మహదేవపూర్ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో వరంగల్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. ఈ ఘటనపై మృతురాలి భర్త సాగర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతురాలికి కుమార్తె, కుమారుడు ఉన్నారు.

అసలేం జరిగింది..!

జూన్ 10న మిత్రుడి పుట్టిన రోజు వేడుకల్లో పార్టీ

- వారం రోజుల తర్వాత ముగ్గురికి అస్వస్థత
- రెండు రోజుల వ్యవధిలో ఇద్దరి మృత్యువాత
- మరొకరి పరిస్థితి విషమం



రామన్నగూడెంలో శ్రావణ్ ఇంటి ఎదుట గుమిగూడిన గ్రామస్తులు



బోగోజు శ్రావణ్(ఫైల్)



ఎస్‌కె.రహీం(ఫైల్)

నర్సింహులపేట: మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండలం రామన్నగూడెం గ్రామానికి ఇద్దరు యువకులు రెండు రోజుల వ్యవధితో మృత్యువాత పడ్డారు. మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన సంఘటన వివరాలు గ్రామస్తుల కథనం ప్రకారం.. జూన్ 10వ తేదీన రామన్నగూడెంలో మిత్రుడి పుట్టిన రోజు వేడుకలకు అదే గ్రామానికి చెందిన బోగోజు శ్రావణ్(25), ఎస్‌కె.రహీం(26), తాడూరి ఉపేంద్రచారితోపాటు మొత్తం పది మంది హాజరయ్యారు. అక్కడ కల్లు, మద్యం సేవించారు. అనంతరం ఇళ్లకు వెళ్లిపోయారు. వారం రోజుల తరువాత శ్రావణ్, రహీం, ఉపేంద్రాచారి అస్వస్థతకు గురికావడంతో కుటుంబ సభ్యులు మహబూబాబాద్‌లో ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో ఖమ్మం.. అక్కడి నుంచి హైదరబాద్ యశోద.. తర్వాత నిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ శ్రావణ్ బుధవారం, రహీం గురువారం మృతి చెందారు. ఉపేంద్రాచారి పరిస్థితి విషమంగా ఉందని తెలిసింది. పార్టీలో పది మంది పాల్గొనగా ఈ ముగ్గురికే ఇలా ఎందుకైందనే దానిపై పలు రకాల చర్చజరుగుతోంది. అసలు వారు తాగిన కల్లు ఏమైనా కల్తీ అయిందా.. లేక తీసుకున్న ఆహారంలో ఏమైనా జరిగిందా.. కల్లు తీసిన లొట్టిని ఇంతకు ముందు గడ్డి మందు పిచికారీకి వినియోగించారా.. మరేదైనా కారణం ఉండవచ్చా.. అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

కేసు దర్యాప్తు చేస్తున్నాం..

శ్రావణ్ తల్లి జయప్రద వీరి మరణంపై అనుమానం వ్యక్తం చేస్తూ ఫిర్యాదు చేసిందని, ఆ మేరకు కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను ఏరియా ఆస్పత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై గంద్రాతి సతీశ్ తెలిపారు. ఫోరెన్సిక్ ల్యాబ్ రిపోర్టు ఆధారంగా మరణాలకు కారణం తెలుసుకుంటామని పేర్కొన్నారు.

రామన్నగూడెంలో విషాదం..

మృతుడు శ్రావణ్ చిన్న వయసులోనే తండ్రి చనిపోగా తల్లి జయప్రద అన్నీ తానై పెంచి పెద్ద చేసింది. చేతికందిన కొడుకు మృతి చెందడంతో తల్లితో పాటుగా వృద్ధులైన నానమ్మ, అమ్మమ్మ దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. మరొకరు ఎస్‌కె.రహీం గ్రామంలో కారోబార్‌గా పని చేస్తున్నాడు. పేద కుటుంబం.

టీజీఐఐసీ భూముల ఆక్రమణపై కఠిన చర్యలు

పరిశ్రమల పేరిట పక్కదారి పట్టించే వారి నుంచి అపరాధ రుసుము వసూలు

- రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు
- వరంగల్ టీజీఐఐసీ కార్యాలయంలో ఆకస్మిక తనిఖీలు

సాక్షిప్రతినిధి, వరంగల్: తెలంగాణ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ(టీజీఐఐసీ) భూములను ఆక్రమణల నుంచి పరిరక్షించుకోవాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అధికారులను ఆదేశించారు. సంస్థ భూములను ఆక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకుని స్వాధీనం చేసుకోవాలని సూచించారు. పరిశ్రమల పేరుతో భూములు పొంది తర్వాత వాణిజ్య అవసరాలకు వినియోగిస్తున్న వారిని గుర్తించి అపరాధ రుసుం వసూలు చేయాలని చెప్పారు. జిల్లాల వారీగా సంస్థకున్న ఖాళీ భూములను కాపాడేందుకు కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. ఉమ్మడి వరంగల్ జిల్లా పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ కార్యాలయాన్ని గురువారం మంత్రి ఆకస్మిక తనిఖీ చేశారు.

భూములను పక్కదారి పట్టిస్తే చర్యలు

వరంగల్ జిల్లాలో పరిశ్రమలకు రాయితీ ధరపై కేటాయించిన రాంపూర్, మడికొండ పారిశ్రామిక వాడల్లో వాణిజ్య కార్యకలాపాలు జరుగుతుండడంపై మంత్రి శ్రీధర్‌బాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే సర్వే చేసి కమర్షియల్ వినియోగానికి మార్చిన భూములను గుర్తించాలని ఆదేశించారు. కేటాయింపులు పొందిన వారి నుంచి నిబంధనల ప్రకారం రోడ్ల వెడల్పును బట్టి 20 శాతం, 50 శాతం జరిమానా వసూలు చేయాలని సూచించారు. అన్ని జిల్లాల్లో ఐటీ పార్కులు సాఫ్ట్‌వేర్ పరిశ్రమలన్నీ హైదరాబాద్‌లోనే కేంద్రీకృతం కాకుండా.. జిల్లాలకు తరలివెళ్తే భవనాలతో పాటు మౌలిక సదుపాయాలు కల్పిస్తామని శ్రీధర్ బాబు వెల్లడించారు. హనుమకొండలోని కాకతీయ సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ పార్కును సందర్శించారు. ప్రస్తుతం అందులో ఆరు సాఫ్ట్‌వేర్ కంపెనీలు పనిచేస్తున్నాయని, మరో రెండు నెలల్లో 8 సంస్థలు కార్యకలాపాలు సాగించేందుకు సంప్రదింపులు జరుపుతున్నాయని చెప్పారు. ఐటీ పార్కులో 64 సీట్ల ప్లగ్ అండ్ ప్లే సౌకర్యం ఉండగా సగం సీట్లను సాఫ్ట్‌వేర్, యానిమేషన్ సంస్థలు లీజుకు తీసుకున్నట్లు తెలిపారు. ఎన్‌ఆర్‌ఐలు, ప్రధాన ఐటీ కంపెనీలు జిల్లాల్లో ప్రాంతీయ కార్యాలయాలను ఏర్పాటు చేయాలని మంత్రి పిలుపునిచ్చారు. ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల్లో ఐటీ పార్కుల ఏర్పాటుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, దీని వల్ల స్థానికంగా ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని తెలిపారు. కార్యక్రమంలో మంత్రి శ్రీధర్ బాబుతో పాటు వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఇది ఆఫీస్ అంటారా?

- అధికారులు ఏం చేస్తున్నారు?
- కొత్త ఫర్నిచర్ ఏర్పాటు చేయండి
- మంత్రి శ్రీధర్‌బాబు ఆదేశాలు

వరంగల్: ఇది ఆఫీస్ అంటారా...ఇంత అధ్వానంగా ఉంటే ఇన్ని రోజులు అధికారులు ఏం చేస్తున్నారని రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం వరంగల్‌లో పలు కార్యక్రమాల్లో పాల్గొన్న మంత్రి.. తెలంగాణ స్టేట్ ఇండస్ట్రీయల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్(టీజీఎస్‌ఐఐసీ)జోనల్ కార్యాలయాన్ని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డితో కలిసి తనిఖీ చేశారు. కార్యాలయంలో ఫైళ్లు ఎక్కడ పడితే అక్కడ ఉండడం, ర్యాక్‌లు సరిగా లేకపోవడం, కుర్చీలు సరిగా లేక పోవడంపై జోనల్ మేనేజర్ సంతోష్‌కుమార్‌ను ప్రశ్నించారు. ఆఫీస్ అంతా కలియ తిరిగి ఉద్యోగులను పలకరించారు. ఈసందర్భంగా ఓ ఉద్యోగి కూర్చున్న కుర్చీకి హ్యాండిల్ లేకపోవడం గుర్తించిన మంత్రి.. అమ్మా నీవు ఎప్పటి నుంచి పనిచేస్తున్నావు..కుర్చీకి హ్యాండిల్ లేకుంటే మార్చాలని అధికారులను అడగొద్దా అన్నారు. రాష్ట్ర టీజీఎస్ఐఐసీ అధికారులకు ఫోన్ చేసి వెంటనే కార్యాలయంలోని ఫర్నిచర్, సౌకర్యాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.



కార్యాలయంలోని ఫర్నిచర్‌పై ఉద్యోగితో మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు